క్లుప్తంగా

ఎమ్మెల్యే అశోక్‌కు సత్కారం



ఎమ్మెల్యే అశోక్‌ను సత్కరిస్తున్న మున్సిపల్ విశ్రాంత ఉద్యోగులు, సిబ్బంది

యానాం: యానాం మున్సిపాలిటీ సిబ్బందికి గత 12 నెలల బకాయి జీతాలతో పాటు విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ మొత్తాలు రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్‌ను శనివారం పలువురు మున్సిపల్ సిబ్బంది దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఉద్యోగులు మాట్లాడుతూ ఎమ్మెల్యే అశోక్ చేపట్టిన ఆమరణ నిరాహారదీక్ష కారణంగా ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేసిందన్నారు. ఎమ్మెల్యే అశోక్ చేసిన సాయాన్ని జీవితంలో మరువలేమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ విశ్రాంత ఉద్యోగులు పొన్నాల మూర్తి, బొడ్డు రమణ, దవులూరి సర్వేశ్వరరావు, తోట వీరభద్రరావు, చెక్కల సత్యనారాయణ, లంక సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి వార్షికోత్సవం



ముమ్మిడివరం: ముమ్మిడివరం అభయాంజనేయ స్వామి ఆలయ 11వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ లక్ష తమలపాకుల పూజ, సహస్ర కదలి ఫల పూజ, సింధూరార్చన, శాంతి హోమం, పూర్ణాహుతి, శాంతి కల్యాణం వంటి పూజలు చేశారు. అనంతరం భారీ అన్న సమారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, గొల్లపల్లి సూర్యారావు తదితరులు స్వామిని దర్శించుకున్నారు.

వెంకన్నకు బంగారం సమర్పణ



ఆలయ ఈవో సాయిబాబుకు బంగారాన్ని అందిస్తున్న చిన్నా దంపతులు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఈదరపల్లికి చెందిన చింతపల్లి చిన్నా, పుష్ప దంపతులు నాలుగు గ్రాముల బంగారాన్ని శనివారం సమర్పించారు. స్వామి వారి అలంకరణలో ఈ బంగారాన్ని ఉపయోగించాలని దాతలు ఆలయ ఈవో దూనబోయిన సాయిబాబును కోరారు. చిన్నా దంపతులకు స్వామి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పట్టణ పార్టీ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి, ఆలయ ధర్మకర్తలు ముంగర ప్రసాద్, దూనబోయిన బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని నగర సంకీర్తన



పటవలలో సాగుతున్న వేంకటేశ్వరస్వామి నగర సంకీర్తన మహోత్సవం

తాళ్లరేవు: పటవల పంచాయతీ బీసీ పేటలో వేంకటేశ్వర కల్యాణ మండపం వద్ద వేంచేసియున్న శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామివారి నగర సంకీర్తన మహోత్సవం శనివారం కన్నుల పండుగగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. స్వామివారి 11వ వార్షికోత్సవం సందర్భంగా వేంకటేశ్వర నగర సంకీర్తన భక్త బృందం ఆధ్వర్యంలో మేళతాళాలు, కోలాటాల నడుమ స్వామివారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

డీఈఓ, ఎంఈఏ కోర్సుల శిక్షణకు దరఖాస్తులు

కొత్తపేట: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, పీఎం కౌశల్ వికాస్ యోజన ఆధ్వర్యంలో స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్కిల్ హబ్ సెంటర్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్ (డీఈఓ), మెడికల్ ఎక్విప్‌మెంట్ అసిస్టెంట్ (ఎంఈఏ) కోర్సుల ఉపాధి శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె.పెద్దిరాజు, డీఎస్‌డీఓ లోకమన్ తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 30 సంవత్సరాల లోపు వారై ఉండాలని పేర్కొన్నారు. ఆధార్, విద్యార్హత, 3 పాస్‌పోర్ట్ ఫొటోస్‌తో సోమవారం కళాశాల స్కిల్ హబ్ సెంటర్‌లో సంప్రదించాలని కోరారు.

మత్స్యకారులకు ప్రభుత్వ భరోసా

- ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకూ చేపల వేట నిషేధం
- అండగా వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం
- ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున ప్రభుత్వ సాయం



బలుసుతిప్పలో బోట్లతో మత్స్యకారులు

కాట్రేనికోన: సముద్ర జలాల్లో చేపల వేట నిషేధ సమయంలో జీవనోపాధిని కోల్పోతున్న మత్స్యకారులకు వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం కొండంత అండగా నిలుస్తుంది. మరపడవలు, తెప్పలపై చేపలు పట్టే మత్స్యకారుల జీవన ప్రమాణాలను పెంచుటకు ప్రభుత్వం వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ.10,000 చొప్పున ఆర్థిక సాయం చేస్తోంది. ప్రభుత్వం ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకూ 61 రోజుల పాటు చేపల వేటను నిషేధించింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది లబ్ధిదారుల ఎంపికకు జిల్లా మత్స్య శాఖాధికారులు సమాయత్తమవుతున్నారు.

17న లబ్ధిదారుల గుర్తింపు

గత ప్రభుత్వ హయాంలో మత్స్యకారులకు చేపల వేట నిషేధ సమయంలో ఒక్కొక్కరికి రూ.4,000 చొప్పున ఇస్తామని చెప్పినా సక్రమంగా అమలుచేయలేదు. ఏనాడు సకాలంలో ఇవ్వకపోగా అరకొరగా కొందరికిచ్చి చేతులు దులిపేసుకునేవారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం తూచా తప్పకుండా ఏటా వేట నిషేధ సమయంలో వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం ద్వారా రూ.10,000 చొప్పున అందిస్తున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలోని తాళ్లరేవు, కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాల్లో సుమారు 1086 రిజిస్టర్ బోట్లున్నాయి. ఆయా బోట్ల ద్వారా వేట సాగిస్తున్న 6,400 మంది లబ్ధిదారులకు గతేడాది వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం కింద ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున ప్రభుత్వం జీవనభృతి చెల్లించింది. సముద్ర జలాల్లో చేపలు, రొయ్యలు సంతానోత్పత్తి కాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఏప్రిల్ 15 నుంచి చేపల వేట నిషేధం అమలు కానుంది. ఈ నేపథ్యంలో వేట నిషేధం కారణంగా ఈ ఏడాది జీవనోపాధి కోల్పోనున్న లబ్ధిదారుల ఎంపికకు ఇప్పటికే జిల్లా మత్స్యశాఖ అధికారులు కసరత్తులు ప్రారంభించారు. ఈ నెల 17వ తేదీన మెకనైజ్డ్, ఇంజిన్ బోట్లను పరిశీలించి ఆయా బోట్ల వద్ద యాజమానితో పాటు లబ్ధిదారుల ఫొటోలు తీసి లబ్ధిదారుల్ని ఎంపిక చేయనున్నట్లుగా కాట్రేనికోన మత్స్యశాఖ అధికారి రామకృష్ణ 'సాక్షి'కి తెలిపారు.

నిబంధనల ప్రకారమే

మత్స్యకార భరోసా పథకంలో అవినీతి ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల్ని ఎంపిక చేస్తున్నారు. వైఎస్సార్ భరోసా పథకానికి 21 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వయసున్న మత్స్యకారులు తమ తెల్లకార్డు, ఆధార్ కార్డు జత చేసి దరఖాస్తు చేసుకోవొచ్చు. కుటుంబంలో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులుంటే వారిని అనర్హులుగా గుర్తిస్తారు. అంతేకాదు కుటుంబానికి 3 ఎకరాల మాగాణి భూమి లేదా 10 ఎకరాల మెట్ట భూమి ఉన్నవారు, అలాగే ఇతరత్రా వ్యాపారాలతో ఆదాయ పన్ను చెల్లించేవారు సైతం అర్హులు కాదు. రైతన్న చేదోడు, రైతు భరోసా, వాహనమిత్ర లాంటి ఇతర ప్రభుత్వ పథకాల ద్వారా జీవనోపాధికి ఉపయోగపడే లబ్ధి పొందుతున్న వారు సైతం అనర్హులే. ప్రభుత్వం అందించే సాయం పక్కదారి పట్టకుండా, అవినీతికి ఆస్కారం లేకుండా లబ్ధిదారుల ఎంపిక విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని జిల్లా మత్స్యకార అధికారులు చెబుతున్నారు.

ఇంటింటికీ సంక్షేమ సమాచారం చేరవేస్తాం

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- భట్నవెల్లిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం



భట్నవెల్లిలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో కరపత్రాలు అందిస్తున్న మంత్రి విశ్వరూప్



గూడాలలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో బ్రోచర్‌ని అందిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అమలాపురం రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నాలుగేళ్లలో పాలనలో నవరత్నాల ద్వారా అందించిన సంక్షేమ సమాచారాన్ని జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ద్వారా ఇంటింటికీ చేరవేస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. శనివారం భట్నవెల్లి గ్రామంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ఇచ్చిన హామీలన్నీ దాదాపు పూర్తి చేశామన్న నమ్మకంతోనే ప్రజలు ముందుకు వెళుతున్నామన్నారు. 13 రోజుల పాటు ప్రతి ఇంటిని సందర్శించి ప్రజలతో మమేకమవుతామని చెప్పారు. దేశ చరిత్రలోనే సంక్షేమ పథకాల విషయంలో ఓ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ శ్రేణులతో జరిగే ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరినీ కలిసి ఇప్పటికే అందిన, భవిష్యత్తులో అందనున్న సంక్షేమ ఫలాల గురించి తెలియజేస్తామని చెప్పారు.

కార్యక్రమంలో సర్పంచ్ తిరికోటి సుజాత, డీసీసీబీ డైరెక్టర్ యిళ్ల గోపాలకృష్ణ, ఎంపీటీసీ ఎస్.పెద్దింట్లమ్మ, మాజీ ఎంపీటీసీ దూనబోయిన రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: మండలంలోని గూడాల గ్రామంలో గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గడప గడపకూ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలపై లబ్ధిదారుల అభిప్రాయాలను తెలుసుకుని, వారి ఇష్టం మేరకు తలుపుపై స్టిక్కర్లు అంటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ అన్నారు. గోడి, బోడసకుర్రు, అల్లవరం, కొమరగిరిపట్నం, ఎస్.పల్లిపాలెం, మొగళ్లమూరు, గూడాల దేవగుప్తం, కోడూరుపాడు తదితర గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ తుట్టెపు బాబి, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, సర్పంచ్‌లు రాయుడు విష్ణు, దాకారపు చిరంజీవిరావు, సొసైటీ అధ్యక్షులు గుర్రం బాబులు తదితరులు పాల్గొన్నారు.



అమలాపురంలో సంక్షేమ పథకాల్ని వివరిస్తున్న జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్ తదితరులు

అమలాపురం టౌన్: మున్సిపాలిటీలోని 30 వార్డుల్లో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాలను రెండో రోజు శనివారం నిర్వహించారు. మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి ఆధ్వర్యంలో మండల జేసీఎస్ కన్వీనర్ పర్యవేక్షణలో సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలంలో వైఎస్సార్ సీపీ నాయకులు కోలా బాబ్జి కాశి వెంకట రమణ, కాశి భాగ్యలక్ష్మి, కాశి శ్రీనివాసరావు, మట్టపర్తి సత్యనారాయణల ఆధ్వర్యంలో రెండో రోజు శనివారం గ్రామగ్రామాన్న జగనన్నే మాభవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు.

తాళ్లరేవు: మండల పరిధిలోని సుంకరపాలెం పంచాయతీ అంబేద్కర్ నగర్‌లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు టిళ్లపూడి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

లంక బ్రిడ్జి పనులు సత్వరమే ప్రారంభిస్తాం

అంబాజీపేట: పి.గన్నవరం మండలంలోని వరద ప్రభావిత లంక గ్రామాలను అనుసంధానం చేస్తూ ఊడిమూడిలో నిర్మించే బ్రిడ్జి పనులను త్వరలోనే ప్రారంభిస్తామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చెప్పారు. అంబాజీపేట మార్కెట్ యార్డులో లంకవాసులతో శనివారం సమావేశం నిర్వహించారు. గత ఏడాది జూలైలో వచ్చిన వరదలకు ముంపునకు గురైన లంక గ్రామాల్లో పర్యటించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్థానిక ప్రజల కోరిక మేరకు బ్రిడ్జి నిర్మాణానికి హామీ ఇచ్చారన్నారు. హామీ అమలులో భాగంగా రూ.49.50 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. బ్రిడ్జిని ఎక్కడ నిర్మించాలనే దానిపై ఊడిమూడి, గంటి పెదపూడి వాసుల అనుమానాలను నివృత్తి చేసేందుకు రెండు గ్రామాల ప్రజలతో చర్చించామన్నారు. అరిగెలవారిపాలెం, గంటి పెదపూడిలంక, ఊడిమూడిలంక, బూరుగులంక గ్రామాలను అనుసంధానం చేస్తూ బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందన్నారు. అలాగే ఉచ్చులవారిపేట, చింతావారిపేటకు మధ్యలో కాలువపై చిన్న బ్రిడ్జి నిర్మిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లంకగ్రామాల ప్రజలతో చర్చించి బ్రిడ్జి నిర్మాణ భూమిపూజకు తేదీని ఖరారు చేస్తామన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకులు మంతెన రవిరాజు, అంబాజీపేట, పి.గన్నవరం పార్టీ మండలశాఖ అధ్యక్షులు వాసంశెట్టి చినబాబు, నక్కా వెంకటేశ్వరరావు, పి.గన్నవరం జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు పాల్గొన్నారు.

రవణం సేవలు అభినందనీయం



వెంకటేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీనియర్ పాత్రికేయులు

అమలాపురం రూరల్: అమలాపురానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ రవణం వెంకటేశ్వరరావు మృతికి అమలాపురం ప్రెస్ క్లబ్ ప్రతినిధులు సంతాపం తెలియజేసి ఆయన సేవలు అభినందనీయంటూ కొనియాడారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రంబాల సత్యనారాయణ అధ్యక్షతన వెంకటేశ్వరరావు సంతాప సభ శనివారం నిర్వహించారు. వెంకటేశ్వరరావు చిత్రపటానికి సీనియర్ పాత్రికేయులు కేఎస్‌వీ శ్రీరామారావు, టీవీ గోవిందరావు, ముక్కామల చక్రధరరావు, సుంకర ప్రసాద్, ఎంఎస్‌వీ ప్రసాద్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్, బీజేపీ ప్రధాన కార్యదర్శి మోకా సుబ్బారావు, సీపీఐ నేత కొప్పుల సత్తిబాబు, వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు అరిగెల వెంకట రామారావు తదితరులు వెంకటేశ్వరరావు సేవలను కొనియాడారు.

చికిత్సకు రూ.40 వేల ఆర్థిక సాయం అందజేత

రాజోలు: బ్లడ్‌క్యాన్సర్ చికిత్స నిమిత్తం కడలి గమళ్లపాలానికి చెందిన కేతా సాయి దిలీప్‌నకు గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవాసమితి రూ.40 వేల ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. సాయాన్ని ఎంపీపీ కేతా శ్రీనివాస్, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్‌లు అందజేశారు.

ఈ సందర్భంగా గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవా సమితి సేవలను అభినందించారు. ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లిన వారంతా స్వగ్రామాల్లోని నిరుపేదలకు ఆర్థికంగా తోడ్పాటు అందిస్తున్నారన్నారు. శెట్టిబలిజ సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి వడ్డాణం సమర్పణ



అమ్మవారికి వెండి వడ్డాణాన్ని సమర్పిస్తున్న నానాజీ

పి.గన్నవరం: ఎల్.గన్నవరంలో వేంచేసిన మహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా యర్రంశెట్టి సత్యనారాయణ కుమారుడు వెంకటేశ్వరరావు (నానాజీ) శనివారం రూ.20 వేల విలువైన వెండి వడ్డాణాన్ని అమ్మవారికి సమర్పించారు. నానాజీ కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి పూజా ఘటానికి వెండి వడ్డాణాన్ని అలంకరించనున్నట్టు ఆలయ కమిటీ నాయకులు తెలిపారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు



రాయవరంలో విలేకరులతో మాట్లాడుతున్న ఆర్డీవో ముక్కంటి

రాయవరం: రామచంద్రపురం, కొత్తపేట రెవెన్యూ డివిజన్ల పరిధిలో పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తున్నట్టు రామచంద్రపురం ఇన్‌చార్జి ఆర్డీవో ముక్కంటి తెలిపారు.

రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాలను తహసీల్దారు కేజే ప్రకాష్‌బాబుతో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షల నిర్వహణపై ఆర్డీవో ముక్కంటి సంతృప్తి వ్యక్తం చేశారు.

చలివేంద్రం ప్రారంభం

రాయవరం: సోమేశ్వరంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు సత్యశ్రీకార్ అండ్ బైక్ వాష్ సర్వీస్ సెంటర్ నిర్వాహకులు శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్ ఆరిఫ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆరిఫ్ మాట్లాడుతూ సామాజిక సేవ చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ప్రస్తుత వేసవిని దృష్టిలో ఉంచుకుని చలివేంద్రాలను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శాకా బుజ్జి, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

వంద మందికి వైద్య పరీక్షలు

కపిలేశ్వరపురం: కేదారిలంక సచివాలయంలో శనివారం విజయవాడకు చెందిన డాక్టర్ వైవీరావు ఉషా కార్డియాక్ సెంటర్ సౌజన్యంతో 100 మందికి గుండె సంబంధిత పరీక్షలను చేశారు. సర్పంచ్ వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీ యర్రంశెట్టి నాగేశ్వరరావు, కార్యదర్శి సీహెచ్ నరసింహారావు శిబిరాన్ని సందర్శించారు. కార్డియాక్ సెంటర్ నిపుణులు గ్రామంలోని ఒక్కొక్కరికి రూ.1200 విలువైన పరీక్షలను ఉచితంగా చేశారు. వారిని ప్రజాప్రతినిధులు అభినందించారు.

పి.గన్నవరం ఎస్సైగా హరికోటిశాస్త్రి

పి.గన్నవరం: స్థానిక ఎస్సైగా హరికోటి శాస్త్రి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మలికిపురం స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇంతవరకూ ఇక్కడ ఎస్సైగా పనిచేసిన పి.గంగాభవాని డీసీఆర్‌బీకి బదిలీ అయ్యారు. ఎస్సై హరికోటి శాస్త్రి విలేకరులతో మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రజలు పోలీసులకు సహకరించాలని అన్నారు. మైనర్లు మోటారు వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో ఎక్కడైనా జూదాలు వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గుట్కా, గంజాయి వంటి విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, చర్యలు తీసుకుంటామని కాయన అన్నారు.


నల్లచెరువులో ధన్వంతరి హోమం

అయినవిల్లి: నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామికి షష్టమ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. శనివారం వేదపండితులు ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా ధన్వంతరి విశేషార్చన, హోమం వంటి విశేష పూజలు జరిపారు. శాంతి హోమం, బలిహరణ, హనుమంత వాహనసేవ వంటి పూజలు జరిపారు. వేంకటేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు.

ఎర్రబారిన సూర్యచంద్రులు



ఓడలరేవు తీరంలో చంద్రుని అందాలు



అమలాపురంలో ఎర్రబారిన వాతావరణంతో అహ్లాదంగా కనిపిస్తున్న సూర్యుడు

మిట్ట మధ్యాహ్నం తీక్షణమైన కిరణాలతో నిప్పులు కురిపిస్తూ... సామాన్యుడిని పరుగులు తీయిస్తున్న భానుడు పొద్దుగూకే వేళ ఎర్రబారి ఇలా అహ్లాదాన్ని పంచుతున్నాడు. మరోవైపు పౌర్ణమి దాటినా తీరంలో చందమామ పరిపూర్ణంగా మారి ఎర్రబారి తన అందచందాలతో మంత్రముగ్ధులను చేస్తోంది. ఒకటి అమలాపురం పార్కు వద్ద అహ్లాదపరిచిన వాతావరణం కాగా, మరొకటి ఓడలరేవు తీరంలో చంద్రుని అందాలు..

– సాక్షి, అమలాపురం

కేన్సర్ రోగికి ఆర్థిక సాయం



కేన్సర్ రోగికి నగదు సాయం అందిస్తున్న జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

అమలాపురం టౌన్: కేన్సర్ వ్యాధికి చికిత్స పొందుతున్న పట్టణానికి చెందిన పట్నాల గౌరీ పార్వతమ్మకు విశ్వ బ్రాహ్మణ యువత రూ.15 వేలు ఆర్థిక సాయం చేశారు. శనివారం స్థానిక దుడ్డివారి అగ్రహారంలోని సంఘ కల్యాణ మండపంలో జిల్లా విశ్వ బ్రాహ్మణ గౌరవాధ్యక్షుడు కట్టోజు సన్యయ్యదాసు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుపాటి వేణుగోపాలకృష్ణ తదితరులు పార్వతమ్మకు సొమ్ము అందజేశారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న అల్లు అర్జున్ అభిమాన సంఘం ప్రతినిధులు

అమలాపురం టౌన్: సినీ హీరో అల్లు అర్జున్ జన్మదినం సందర్భంగా శనివారం స్థానిక గీతాశ్రమం వద్ద పట్టణ అభిమానుల సంఘం అధ్యక్షుడు వర్రే శేషు ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. గోశాలలో గోవులకు దాణా నిమిత్తం నగదు అందజేశారు. కార్యక్రమంలో అభిమానుల సంఘం కార్యదర్శి కోశా రాంబాబు, మెగా అభిమానుల సంఘాల ప్రతినిధులు నల్లా చిట్టిబాబు, ఏడిద శ్రీను, నల్లా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తుకు విశేష స్పందన

తాళ్లరేవు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని తాళ్లరేవు మండల వైఎస్సార్ సీపీ సచివాలయాల కన్వీనర్ దున్నా సత్య శ్రీకాంత్ శనివారం తెలిపారు. మండలంలోని 24 సచివాలయాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం విజయవంతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

హిందూ ధర్మరక్షణ ఓ కర్తవ్యం కావాలి

అమలాపురం టౌన్: హిందూ ధర్మరక్షణ ఓ కర్తవ్యం కావాలని విశ్వ హిందూ పరిషత్ జాతీయ సహ కార్యదర్శి గుమ్మళ్ల సత్యంజీ అన్నారు. స్థానిక లయన్స్ హాలులో శనివారం జరిగిన వీహెచ్‌పీ జిల్లా ధర్మ ప్రచార విభాగ ధర్మరక్షకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సనాతన ధర్మాన్ని కాపాడుకోవడం మన బాధ్యత అని స్పష్టంచేశారు. కార్యక్రమంలో జనహిత సేవా ట్రస్ట్ జాతీయ సహ మంత్రి డాక్టర్ నరసింహాచారి, జిల్లా ధర్మ ప్రచార విభాగ ప్రముఖ్ రేలంగి కుమార్ శంకర్ గౌడ్, భమిడిపాటి కృష్ణమూర్తి, సతీష్, కుడుపూడి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఇంటి తలుపులు పగులగొట్టి చోరీ

మామిడికుదురు: తాళం వేసి ఉన్న ఇంటి వెనుక వైపు తలుపులు పగులగొట్టి దొంగతనానికి పాల్పడిన సంఘటన కరవాక గ్రామంలో జరిగింది. దీనిపై బాధితుడు మన్నే శ్రీనివాసరావు శనివారం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని నగరం ఎస్సై షేక్ జానీబాషా తెలిపారు. శ్రీనివాసరావు పంచాయతీ పక్కన ఉన్న తన ఇంట్లో కిరాణా షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడని ఎస్సై చెప్పారు. శ్రీనివాసరావు భార్య అనారోగ్యంతో ఉండడంతో వారి కుటుంబ సభ్యులంతా రెండు నెలల నుంచి గొల్లపాలెంలోని తన సోదరుడి ఇంట్లో ఉంటున్నారన్నారు. అతని కుటుంబ సభ్యులు ప్రతి రోజు ఇంటికి వచ్చి కిరాణా సరుకులు అమ్ముకుని వెళ్తుంటారన్నారు. ప్రతిరోజు మాదిరిగా ఇంటికి వచ్చే సరికి వెనుక తలుపులు బద్దలు గొట్టి ఉండడం చూసి ఫిర్యాదు చేశారని ఎస్సై చెప్పారు. ఇంట్లోని బీరువా తాళాలు బద్దలు గొట్టి అందులోని కొంత నగదు, బంగారం, వెండి తీసుకుపోయారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.